క్లుప్తంగా

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు

చీమకుర్తి: దాదాపు రెండు నెలల క్రితం బదిలీలు జరిగిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలివ్వాలని ఏపీటీఎఫ్ చీమకుర్తి మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. క్యాడర్ స్ట్రెంగ్త్ ప్రక్రియను వెంటనే పూర్తి చేసి జిల్లా ట్రెజరీకి పంపించి జీతాల సమస్య పరిష్కరించాలని జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దార్ పీ మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందించారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బీ శేషారావు, చీమకుర్తి మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జే యాకోబు, ఆవుల హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

భారీ తిమింగలం అస్థిపంజరాన్ని తిలకించిన విద్యార్థులు


భారీ అస్థిపంజరాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

ఒంగోలు: స్థానిక శర్మా కాలేజీలోని భారీ తిమింగలం అస్థిపంజరాన్ని విద్యార్థులు శనివారం ఆసక్తిగా తిలకించారు. ప్రయోగ పరీక్షల పరిజ్ఞానం కోసం స్థానిక జాహ్నవి నీట్ అకాడమీ విద్యార్థులు శర్మా కాలేజీ ప్రయోగకేంద్రానికి చేరుకున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద జంతువు అయిన భారీ తిమింగలం అస్థిపంజరం విశేషాలను శర్మా కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు వివరించారు. కార్యక్రమంలో జాహ్నవి నీట్ అకాడమీ డైరెక్టర్ పి.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత

తర్లుపాడు: మండలంలోని మంగళకుంట గ్రామానికి చెందిన గుమ్మా పెద్దచెన్నయ్య అనారోగ్యంతో విజయవాడలో గత 15 రోజులుగా వైద్య సేవలు నిమిత్తం ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ ఆవుల రాజు విజయవాడ వెళ్లి పెద్ద చెన్నయ్యకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ నగదును అందించారు. కుటుంబ అవసరాన్ని గుర్తించి వ్యయ ప్రయాసలకోర్చి విజయవాడ వచ్చి పింఛన్ అందించటంతో పెద్దచెన్నయ్య సంతోషం వ్యక్తం చేశారు. వలంటీర్ రాజును స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు రాజేంద్రప్రసాద్, సర్పంచ్ పిన్నిక శారద, వైస్ ఎంపీపీ కందుల సుజాత, ఎంపీడీఓ నరసింహులు అభినందించారు.

కారు ఢీ, వ్యక్తికి తీవ్రగాయాలు

మేదరమెట్ల: రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో తీవ్రగాయలయ్యాయి. ఈఘటన శనివారం రాత్రి మేదరమెట్ల పోలీసు స్టేషన్ సమీపంలో జరిగింది. అందిన సమాచారం మేరకు దొడ్డా ఆంజనేయులు కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల జాతీయ రహదారి తమ్మవరం రోడ్డు సమీపంలో రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తుండగా ఆదే సమయంలో ఒంగోలు వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు ఆంజనేయులును ఢీ కొంది. దీంతో ఆంజనేయులు రోడ్డుపై పడిపోయాడు తలకు తీవ్రగాయం కాగా 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మేదరమెట్ల ఎస్‌ఐ పీ.నాగశివారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గాయపడిన వ్యక్తిది దైవాలరావూరుగా స్థానికులు తెలిపారు.

ఓటర్ల సర్వే పూర్తి చేయాలి

- ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించాలి
- ఫోన్లు చేసి సర్వే చేయొద్దు
- బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో తహసీల్దార్ రమణారావు


ఓటర్ల సర్వేపై బీఎల్‌వోలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రమణారావు

కొత్తపట్నం: ఓటర్ల సర్వే ఇంటింటికి తిరిగి పూర్తి చేయాలని తహసీల్దార్ బీవీ రమణారావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఓటరు ఇంటికి బీఎల్‌వో వెళ్లి పూర్తి సమాచారం తెలుసుకోవాలని సూచించారు. ఫోన్‌లో సమాచారం తెలుసుకుని తప్పుడు వివరాలు నమోదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 100, 80 సంవత్సరాలున్న వ్యక్తుల వివరాలు నమోదు చేయాలన్నారు. డోర్ నంబర్ లేని వారి పేర్లు నమోదు చేయాలన్నారు. ఒక ఇంట్లో పది ఓట్లు దాటితే మరో డోర్ నంబర్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఫారం-6లో కొత్త ఓట్లు నమోదు చేయడం, ఫారం-7లో మరణాలు తొలగించడం, ఫారం-8లో చిరునామాలు మార్చడం వంటివి చేయాలన్నారు. పూర్తి సమాచారం బీఎల్‌వోల దగ్గర ఉండాలన్నారు. తాము ఎక్కడైనా విచారణకు వెళ్లినప్పుడు బీఎల్‌వో మా ఇంటికి రాలేదని ఏ ఓటరూ చెప్పకూడదన్నారు. రాజకీయ పార్టీల నాయకులను వెంటపెట్టుకుని వెళ్లాలని బీఎల్‌వోలను ఆదేశించారు. ఫారం-6, 7, 8 వచ్చాయని, పూర్తి వివరాలు రాజకీయ నాయకులకు ఇవ్వాల్సి ఉందని తహసీల్దార్ తెలిపారు. ఆధార్ అనుసంధానం 75 శాతం పూర్తయిందని, మిగతా 25 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14 నాటికి సర్వే పూర్తి చేయాలని కోరారు. భార్యాపిల్లలు, భర్త మరో బూత్‌లో ఉన్నా, వేరువేరు సీరియర్ నంబర్లలో ఉన్నా ఒకేచోట చేర్చాలని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కోటేశ్వరరావు, సుబ్బారావు, రామసుబ్బారావు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులను ఖండించాలి

- కొత్తపట్నంలో పాస్టర్ల నిరసన


మణిపూర్ ఘటనపై నిరసన తెలుపుతున్న పాస్టర్లు

కొత్తపట్నం: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఖండించాలని, వారిని సురక్షితంగా ప్రభుత్వం కాపాడాలని రాష్ట్ర పాస్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు పి.ప్రభుకుమార్ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న హింసాత్మక దాడులను ఖండిస్తూ కోస్టల్ పాస్టర్స్ అసోసియేషన్, రూరల్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కొత్తపట్నంలో నిరసన వ్యక్తం చేశారు. ముందుగా రంగాయపాలెం కవనెంట్ చర్చిలో పాస్టర్లందరూ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుకుమార్ మాట్లాడుతూ మణిపూర్ ఘటనలో క్రైస్తవులు వందల సంఖ్యలో కాల్చబడ్డారని, వారిని పట్టించుకున్న నాథుడే లేడని మండిపడ్డారు. ఒక మనిషిని కళ్ల ముందే కొట్టి చంపడం ఎంత దారుణమని, ఇటువంటి సంఘటనలు ఏ రాష్ట్రంలో జరగలేదని గుర్తు చేశారు. క్రైస్తవులు ఎప్పుడూ శాంతియుతంగా ఉంటారని, అటువంటి వారిపై దాడులు చేయడం అమానుషమని అన్నారు. కోస్టల్ పాస్టర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎన్.ధనరాజ్ మాట్లాడుతూ కేంద్రం ముందుగా పట్టించుకుంటే ఇంత మంది మరణించేవారు కాదని, ప్రాణ, ఆస్తి నష్టం జరిగి ఉండేదే కాదని అన్నారు. కనీసం పోలీసులే వెళ్లలేని పరిస్థితి అక్కడ నెలకొందని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ పట్టీపట్టనట్లు వ్యవహరించడం వలనే ఇంత దూరం వచ్చిందని విమర్శించారు. ఓటు అనే ఆయుధంతో వచ్చే ఎన్నికల్లో మోదీకి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 150 చర్చీలు ఉన్నాయని, అందరూ ఐక్యంగా పోరాడి క్రైస్తవులపై జరుగుతున్న దాడులపై తిప్పికొట్టాలన్నారు. మణిపూర్ దాడుల్లో దెబ్బతిన్న వారు కోలుకోవాలని చర్చిలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఏపీ పాస్టర్ల ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు జాన్ డేవిడ్, మండల కోస్టల్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.జాషువ, మండల రూరల్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, పాస్టర్లు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న చెంచిరెడ్డి, నాయకులు

చీమకుర్తి: సంతనూతలపాడులోని అంకాలమ్మ ఆలయం వద్ద నుంచి రూ.30 లక్షలతో సిమెంట్ రోడ్డు, సైడు కాలువల నిర్మాణానికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. డీఎంఎఫ్‌కు చెందిన నిధులతో రోడ్డు, సైడు కాలువ నిర్మిస్తున్నట్లు చెంచిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, సర్పంచ్ దర్శి నాగమణి, ఎంపీటీసీ బాపట్ల సుబ్బారావు, దుంపా యలమందారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

9వ తేదీ నుంచి 'నా మట్టి-నా దేశం'

చీరాల టౌన్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ, మండల స్థాయిలో నిర్వహించనున్న 'నా మట్టి-నా దేశం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కే నేతాజీ సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీలు, సచివాలయాల సెక్రటరీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈనెల 9 నుంచి 15 వరకు గ్రామస్థాయిలో, 16 నుంచి 20 వరకు మండల స్థాయిలో కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్నీ సచివాలయాలు, పంచాయతీల్లో విధిగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను అందించారు. అలానే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్మూలనకు చర్యలు తీసుకుని గ్రామాల్లో చెత్తకుప్పలు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా వాటర్ ట్యాంకులు, ఆర్వో ప్లాంట్లు మరమ్మతులు చేయించి మంచినీరు ప్రజలకు అందించాలన్నారు. పంచాయతీల్లో నిర్మాణాల్లో ఉన్న సచివాలయాల శాశ్వత భవనాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు త్వరగా చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ మురళీ బాపూజీ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సెక్రటరీలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణ పరిరక్షణపై కరపత్రాలు విడుదల చేస్తున్న అతిథులు

చీరాల అర్బన్: పర్యావరణాన్ని పరిరక్షించకుంటే మానవాళి మనుగడ రానున్న దశాబ్దంలో ప్రశ్నార్థకమవుతుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు కోట వెంకటేశ్వరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వై.భాస్కరరావు అన్నారు. శనివారం గౌతమి విద్యాసంస్థల సౌజన్యంతో డిగ్రీ కాలేజీ ఆవరణలో ప్రకృతి పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వ, ప్రజలందరి కర్తవ్యం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. 21వ శతాబ్దపు అతి పెద్ద సవాలుగా పర్యావరణ పరిరక్షణ సమస్య ముందుకు వచ్చిందన్నారు. పర్యావరణ పరిరక్షణకు బలమైన ప్రజా ఉద్యమం రావాలన్నారు. ఇది ప్రజలందరి బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ కర్తవ్యమని అన్నారు. అడవుల నరికివేత, పట్టణీకరణ, ప్రకృతి వనరుల విధ్వంసం, విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం వలన నదీజలాలు, సముద్ర జలాలు కాలుష్యంతో పర్యావరణ సమస్య ఎక్కువైందన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక, పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, చీరాల అభివృద్ధి సాధన సమితి, నేషనల్ గ్రీన్ కోర్, ఘంటసాల చైతన్య వేదిక, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యాసంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయకాలనీలో అభివృద్ధి పనులకు శ్రీకారం


పనులను ప్రారంభిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు టౌన్: నగరంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులు చకాచకా జరుగుతున్నాయి. స్థానిక 16వ డివిజన్ దత్తాత్రేయకాలనీలో రూ.36.65 లక్షలతో చెరువు ఆధునికీకరణ పనులకు శనివారం నగర మేయర్ గంగాడ సుజాత భూమిపూజ చేశారు. చెరువు ఆధునికీకరణ పనుల గురించి మేయర్ వివరించారు. చెరువులోని నీటిని తోడేసి జంగిల్ క్లియరెన్స్ చేసి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత సహకారంతో డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు స్థానిక కార్పొరేటర్ శ్రీరాం నాగభూషణం తెలిపారు. ఇప్పటికే రెండు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని, మరో రెండు కోట్ల రూపాయలతో త్వరలోనే మరికొన్ని పనులకు శ్రీకారం చుట్టనున్నామని చెప్పారు.

కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ బెంగళూరు నరసయ్య, డివిజినల్ ఇంజినీర్ రఘురాం, వైఎస్సార్ సీపీ నాయకులు అడపాల రాము, జి.వెంకటేశ్వర్లు, వంశీ, లక్ష్మయ్య, బుజ్జి మాస్టర్, సంతోష్, జీవన్, డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు అమృతం.. తల్లిపాలు

- ఒంగోలు జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్


బిడ్డకు తల్లి పాలిచ్చే ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న పీడియాట్రిక్ విభాగం వైద్యసిబ్బంది

ఒంగోలు అర్బన్: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, తద్వారా తల్లికి శ్రేయస్సు కూడా అని ఒంగోలు జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం జీజీహెచ్‌లో పీడియాట్రిక్ విభాగం ఆధ్వర్యంలో వైద్య అధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్‌నాయక్ మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు పట్టేందుకు జీజీహెచ్‌లో ప్రత్యేక గది కూడా ఏర్పాటు చేశామన్నారు. తల్లి పాలు బిడ్డకు ఇవ్వడంపై ఎటువంటి అపోహలు అవసరం లేదన్నారు. దేశంలో 24 శాతం మంది తల్లులు మాత్రమే తల్లిపాలు బిడ్డకు ఇస్తున్నట్లు గణాంకాలు తెలపడం ఆందోళనకరమన్నారు. అనంతరం తల్లి పాలు బిడ్డకు అందించడంపై అవగాహన కల్పిస్తూ స్కిట్, మైమ్స్ ప్రదర్శించారు. కార్యక్రమంలో గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఎలిజిబెత్, డాక్టర్ శివరామకృష్ణ, నర్సింగ్, వైద్య విద్యార్థులు, గైనిక్, పీడియాట్రిక్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులు ఆసరాగా ఉంటే సంతోషాలే


కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

ఒంగోలు: ప్రస్తుత సమాజంలో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు, వ్యాపారాలలో నిత్యం బిజీ అవుతున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో వృద్ధులు ఆసరాగా ఉంటే ఆ కుటుంబం సంతోషాల హరివిల్లుగా మారుతుందని స్థానిక క్విస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. శనివారం స్థానిక కర్నూల్ రోడ్డులోని క్విస్ పాఠశాలలో బామ్మ-తాతయ్య, మనుమడు-మనుమరాలు మధ్య సంబంధం అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలబాలికలకు చేదోడు, వాదోడుగా ఉండాల్సిన బాధ్యత తాతయ్య, బామ్మలపై ఉందన్నారు. ఆధునిక ప్రపంచంలో ఈ బంధాలు తగ్గిపోతున్నాయని, బాలబాలికలకు మంచి విద్యాబుద్ధులతో పాటు సమాజంలో ఎలా మెలగాలనేది కూడా నేర్పించాల్సిన అవసరాన్ని గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో చిన్నారుల తాతయ్య, నాయనమ్మ, బామ్మలు పాల్గొని చిన్నారులతో తమ అనుభవాలను పంచుకున్నారు.

211 మంది విద్యార్థులకు ఉద్యోగాలు


ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

ఒంగోలు: ప్రాంగణ ఎంపికల్లో తమ విద్యార్థులు 211 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని శ్రీహర్షిణీ విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ తెలిపారు. శనివారం కాలేజీలో జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆయన మాట్లాడారు. డిగ్రీ ఫైనలియర్ పూర్తిచేసిన విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు జరిగాయన్నారు. హైదరాబాద్‌కు చెందిన హెచ్‌డీఎఫ్‌సీ కంపెనీకి 53 మంది, టాటా క్యాపిటల్ హోం లోన్స్ 17 మంది, డీసీబీ బ్యాంకుకు 13 మంది, ఓపెన్ మైండ్ కంపెనీకి 9 మంది, బెంగళూరుకు చెందిన అల్ఫా టెక్నాలజీస్ కంపెనీకి 107 మంది, ఒంగోలుకు చెందిన సిరా టెక్నిక్స్‌కు ముగ్గురు, ఒనికార్ట్ రిటైల్ సేల్స్ అండ్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి 9 మంది ఎంపికయ్యారని వివరించారు. వీరికి వార్షిక వేతనం రూ.2.10 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ ఏడాది మొత్తం 763 మందికి ఉద్యోగాలు కల్పించామని రవికుమార్ తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ముండ్లమూరు: మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఐ యువీ కృష్ణయ్య తెలిపారు. దర్శి - అద్దంకి ప్రధాన రహదారిలో శనివారం నో యాక్సిడెంట్ డే కార్యక్రమం నిర్వహించారు. ఉల్లగల్లు, రెడ్డినగర్ ప్రభుత్వ పాఠశాలల వద్ద గల రహదారిలో స్పీడు బ్రేకర్లకు తెల్లరంగు వేయించిన అనంతరం వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

కుష్టు వ్యాధిపై అశ్రద్ధ తగదు

ముండ్లమూరు: గ్రామాల్లో కుష్టు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాధవీలత కోరారు. మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పూరిమెట్లలో శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. వైద్యాధికారి ప్రవీణ్ పాటు 69 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీమవరం, పూరిమెట్ల, మారెళ్ల, నూజిళ్లపల్లిలో నూతనంగా కనిపెట్టిన కుష్టు రోగులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ మధుశంకర్, డీపీఎంవో సుబ్బారెడ్డి, రాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచితంగా హెల్మెట్‌ల పంపిణీ


హెల్మెట్‌లు అందజేస్తున్న ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు

కంభం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని స్థానిక ఎస్‌ఐ నాగమల్లేశ్వరరావు సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సమితి ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా హెల్మెట్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎస్‌ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తలకు హెల్మెట్ ఉంటే ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. తలకు హెల్మెట్ కవచం లాంటిదని, పోలీసులు ఫైన్ వేస్తారన్న భయంతో కాకుండా విలువైన ప్రాణాలు కాపాడుకోవడం కోసం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్‌లు పంపిణీ చేసిన అల్లూరయ్యను ఎస్‌ఐ అభినందించారు. అంబేడ్కర్ ఆశయ సమితి అధ్యక్షుడు కాటమాల అల్లూరయ్య, ఎంపీటీసీ ఆనంద్ ప్రదీప్, హుస్సేన్‌బాషా, మధు, నవీన్ పాల్గొన్నారు.

పతకాలు సాధించిన ఎన్‌సీసీ విద్యార్థులకు అభినందనలు


పతకాలు సాధించిన విద్యార్థులతో ఎంఈవో, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

యర్రగొండపాలెం: ఒంగోలులో జరిగిన కంబైండ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపు-4లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థినీ, విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలతో మెరిశారు. వీరికి శనివారం ఎంఈవో పి.ఆంజనేయులు, పాఠశాల హెచ్‌ఎం కె.రమాదేవి, ఎన్‌సీసీ అధికారి కాకర్ల సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారిని అభినందించారు. గత నెల 22 నుంచి 31వ తేదీ వరకు ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఈ క్యాంపులో గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన 9 బెటాలియన్‌ల నుంచి 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 34వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు బంగారు, వెండి పతకాలను సాధించారు. షేక్ అనీషా నీలోఫర్ సాంస్కృతిక పోటీల్లో బంగారు, టగ్ ఆఫ్ వార్‌లో వెండిపతకం, బొందిలి గాయత్రి షూటింగ్‌లో వెండి పతకం, నవ్యశ్రీ, చరిత, డి.కాశింబీ, కోలా ఉమాశంకర్, సువర్ణరాజు టగ్ ఆఫ్ వార్‌లో వెండి పతకాలు, ఎనిబెర జాన్‌వెస్లీ, పవన్‌కుమార్ డ్రిల్‌లో వెండి పతకాలు సాధించారు. పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడర్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఎంఈఓ సూచించారు.